క్లుప్తంగా

గంగమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పణ

కడప కార్పొరేషన్: చింతకొమ్మదిన్నె గంగమ్మ తల్లికి తిరుమల టింబర్ డిపో అధినేత కంచి గోపీక్రిష్ణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు. గంగమ్మ జాతర మహోత్సవం సందర్భంగా వారు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గోపీక్రిష్ణ దంపతులను దేవస్థానం కార్యనిర్వాహక అధికారి సురేష్ రెడ్డి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మలిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సాయిపేట శ్రీనివాసులు సుబ్రహ్మణ్యం, శంకరాపురం సింధు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు రంజాన్ కిట్ల పంపిణీ



రంజాన్ కిట్‌ను అందజేస్తున్న అతిథులు

కడప కల్చరల్ : స్థానిక లజ్‌నతుల్ ఉలమా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం కడప నగరం కాగితాలపెంటలోని ఫంక్షన్ హాలులో పేద ముస్లింలకు రంజాన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా వైద్యులు ఆబిద్, రబ్బాని, ఇర్ఫాన్‌లు హాజరయ్యారు. దాదాపు 200 మంది పేదలకు 17 రకాల నిత్యావసర సరుకులతో కూడిన రంజాన్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లజ్‌నతుల్ ఉలమా వేల్ఫేర్ సొసైటీ కార్యదర్శి మౌల్వి ఖాజీ సయ్యద్ మహమ్మద్ అలీ రషాది, అధ్యక్షులు మౌలాన హఫీజ్ అస్గర్ అలీ, ముస్లిం ప్రముఖులు మౌలానాలు నూరుల్లా, షాజాద్ హుసేనీ, హఫీజ్ ఖ్వాజీ, సిరాజ్ బుఖారి తదితరులు పాల్గొన్నారు.

పౌర్ణమి పూజలు



విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున పుణ్యనదీ జలాలతో నింపిన తొమ్మిది కలశాలను ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్, వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు ఆలయం చుట్టూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. మంగళ వాయిద్యాల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో తొమ్మిది మంది దంపతులు ఇతర భక్తులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి మూలమూర్తికి కలశాలలోని పవిత్ర జలంతో ప్రత్యేకంగా నవకలశ స్నపనం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. అమ్మవారిని కనుల పండువగా అలంకరించారు. ఉదయం యాగశాలలో చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం 108 మంది ముత్తయిదువులు అమ్మవారి ఆలయ ప్రాంగణంలో 108 దీపాలను వెలిగించి అష్టోత్తర శతదీపాలంకార సేవ నిర్వహించారు. రాత్రి పల్లకీ సేవ నిర్వహించారు.

చిల్లీస్ రెస్టారెంట్ ప్రారంభం



చిల్లీస్ రెస్టారెంట్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: కడప నగరంలోని రైల్వే స్టేషన్‌రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చిల్లీస్ రెస్టారెంట్‌ను ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా, కడప మేయర్ కె. సురేష్ బాబు, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ ఏ. మల్లికార్జునరెడ్డి, ప్రభుత్వ సలహాదారు చల్లా మధుసూదన్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ రుచికరమైన ఆహార పదార్థాలు తయారు చేసి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చిల్లీస్ రెస్టారెంట్ యజమాని హర్షవర్ధన్‌రెడ్డి, వారి బంధుమిత్రులు పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి పల్లకీ సేవ



వీరభద్రస్వామి పల్లకీ సేవలో భక్తులు

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థానంలో సోమవారం వీరభద్ర స్వామి ఉత్సవ విగ్రహ మూర్తులకు ఘనంగా పల్లకీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ జీవై వెంకటసుబ్బారెడ్డి(ఉదయ్) ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సోమవారం తెల్లవారుజాము నుంచి వీరభద్ర స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరభద్ర స్వామి సమేత భద్రకాళీమాతలను ప్రత్యేకంగా అలంకరించి భక్తుల నడుమ పల్లకి సేవ కార్యక్రమం నిర్వహించి విశేష పూజలు చేశారు.

ఇఫ్తార్ విందుతో సోదరభావం



ఇఫ్తార్ విందులో పాల్గొన్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



డిప్యూటీ సీఎం అంజద్‌బాషను సత్కరిస్తున్న దృశ్యం

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి యస్.బి.అంజాద్ బాషా

కడప కార్పొరేషన్: రంజాన్ మాసం ముస్లింలకు ఎంతో పవిత్రమైనదని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. సోమవారం సాయంత్రం వినాయక నగర్‌లోని ఎంఎం రెస్టారెంట్‌లో అవినాష్ రెడ్డి, ఫజల్, రెహమాన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందులు.. ప్రజల మధ్య సోదరభావం పెంచుతాయన్నారు. ధార్మిక చింతనకు, దైవభక్తికి, క్రమశిక్షణకు, దాతృత్వానికి రంజాన్ మాసం కేంద్రబిందువన్నారు. మనిషి సత్ప్రవర్తనతో నడవడానికి.. రంజాన్ ఉపవాసాలు ఉపకరిస్తాయన్నారు. సర్వమతాల సారం ఒక్కటేనని, మనుషుల్లో ప్రేమ, సోదరభావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడానికి ఉపవాసాలు, ఆరాధ్యప్రార్థనలు ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు డాక్టర్ సోహైల్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఎస్.సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంజాద్ బాష విజయం తథ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎన్నికల్లో కడప అసెంబ్లీ నియోజకవర్గం తరుపున వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా అంజద్‌బాష విజయం తథ్యమని బేడ బుడగజంగం సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు డి.శ్రీరాములు తెలిపారు. ఈ మేరకు ఆయన సంఘ నాయకులతో కలిసి డిప్యూటీ సీఎం అంజద్‌బాషను కలిసి సత్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంజద్ బాష అనునిత్యం కడప ప్రజల మధ్య ఉంటూ సమస్యలను పరిష్కరించారని, అట్టడుగున ఉండే బుడగ జంగాలను ఎస్సీలుగా గుర్తించడంతోపాటు క్యాబినెట్‌లో తీర్మానం చేసి కేంద్రానికి పంపించడం విషయంలో ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బంగారు నాగయ్య యాదవ్, సంక్షేమ సంఘం కుల నాయకులు డి.అల్లురయ్య, సి.పెంటయ్య, సి.చంద్రయ్య, డి.నాగరాజు, డి.దస్తగిరి, సి.గోవిందు, పి.సాయి, కే.మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరపౌర్ణమి వేడుకలు



శ్రీకృష్ణ, బలరాములకు మహా పుష్పాభిషేకం



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో సోమవారం గౌరపౌర్ణమి వేడుకలను అంతర్జాతీయ కృష్ణచైతన్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణ బలరాముల విగ్రహాలకు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భజన, కీర్తన, హారతి, మహా శంఖాభిషేకం, మహా పుష్పాభిషేకంలను నిర్వహించారు. భగవద్గీత ప్రవచనాలు చేశారు. మహాహారతి తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా 30 వేల మంది భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. ఉదయం కొర్రపాడు రోడ్డులోని ఇస్కాన్ కేంద్రంలో శ్రీకృష్ణుడు, బలరాములకు విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. ఇస్కాన్ కేంద్రం నిర్వాహకుడు మధురేసుదాసు శ్రీకృష్ణుడి లీలను, భగవద్గీత గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు మారుతిప్రసాద్, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

వ్యక్తి అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం పాత కడప ఆర్చీ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న షేక్ సాదక్ అహ్మద్ అనే వ్యక్తిని ఎస్‌ఐ పి.రవికుమార్ అరెస్ట్ చేసినట్లు సీఐ పి. నరసింహారెడ్డి తెలియజేశారు. నిందితుడి వద్ద నుంచి 22 క్వార్టర్ బాటిళ్ల మద్యంను సీజ్ చేశామన్నారు.

అభ్యుదయవాద కవి వైసీవీ రెడ్డి



వైసీవీ రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు

కడప కల్చరల్ : అభ్యుదయ వాదంతో కూడిన కథలు, ప్రేరణ కలిగించే కవితలు, పలు వ్యాసాలు, రచనలు చేసిన కవి వైసీవీ రెడ్డి అని.. ఆయన అభ్యుదయవాదం వైపు తన కవిత్వాన్ని నడిపించారని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాదరెడ్డి అన్నారు. సోమవారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో వైసీవీ 99వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత సంచాలకులు పరిశోధన కేంద్రం సిబ్బంది, పాఠకులతో కలిపి వైసీవీ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యమ్మనూరు చిన్న వెంకటరెడ్డి వైసీవీ రెడ్డిగా, కవిగా సుప్రసిద్ధులని, ఆయన సమగ్ర సాహిత్యం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీనివాసుని కల్యాణం



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : మండల పరిధి అనంతరాజపురం పంచాయతీలోని లక్ష్మీపాళెం గ్రామంలో శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన స్వామివారి కల్యాణం నేత్రపర్వంగా సాగింది. ఇందులో భాగంగా తొలుత శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి కల్యాణ వేదికపైకి చేర్చి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం స్వామి వారిని గజ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఈఓ శివయ్య, ఆలయ ప్రధాన అర్చకులు భరద్వాజ్, ఆలయ కమిటీ చైర్మన్ మెంటా అశోక్‌కుమార్, ఉత్సవ కమిటీ సభ్యులు కామసముద్రం హర్షబాబు, మెంటా చంద్రయ్య, పెద్ద వీరయ్య, రమణమ్మ, లక్షుమ్మ, సుబ్బయ్య, వెంకటసుబ్బమ్మ, చిన్నగురవయ్య పాల్గొన్నారు.

ఘనంగా నీలకంఠ్రావుపేట దర్గా ఉరుసు



ఉరుసు వేడుకలకు తరలివచ్చిన భక్తులు

రామాపురం : నీలకంఠ్రావుపేట సమీపంలోని సద్గురు హజరత్ దర్బార్ అలీ షావలి రహంతుల్లా అలైబాబా, జలీల్ మస్తాన్‌వలి బాబాల ఉరుసు సోమవారం ప్రారంభమైంది. మొక్కుబడులు ఉన్న భక్తులు జెండాలు, పక్కీర్ల విన్యాసాల నడుమ జెండాను తీసుకొచ్చారు. జెండా మెరవణి అనంతరం రాత్రి ఖవ్వాలి పోటీలు జరిగాయి. మంగళవారం తహాలీల్ మహా నైవేద్యం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఉరుసు ఉత్సవాల్లో జిల్లా నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తును ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్ రెడ్డి తన సిబ్బందితో చేపట్టారు. వచ్చి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని చర్యలను దర్గా స్వామిజీ కమిటీ సభ్యులు తీసుకున్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వల్లూరు: వల్లూరు మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో విజయ భాస్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని ఎంపీటీసీలు, సర్పంచులు, మండల కో ఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు.

వైభవంగా ఓబులేసు కోన తిరునాల

ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి



బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఆకేపాటి

ఒంటిమిట్ట : మండల పరిధిలోని తప్పెటవారిపల్లె, ఇబ్రహీంపేట గ్రామాల సమీపంలో ఉన్న ఓబులేసు కోనలో తిరునాల వైభవంగా జరుగుతోంది. సోమవారం తిరునాలలో వైఎస్సార్‌సీపీ రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథరెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో ఆకేపాటికి స్వాగతం పలికి స్వామి వారి దర్శనం చేయించి, ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అదే రోజు సాయంత్రం వేల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

తిరునాల సందర్భంగా మధ్యాహ్నం బండలాగుడు పోటీలు రసవత్తరంగా నిర్వహించారు. ఈ బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ప్రారంభించారు. మొత్తం ఐదు ఎడ్ల కాడ్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఈ పోటీలలో కడప జిల్లా, ప్రొద్దుటూరు టౌన్ కి చెందిన ద్వార్షల గురివిరెడ్డి కాడ్లు మొదటి స్థానంలో నిలిచాయి. అలాగే అన్నమయ్య జిల్లా నందలూరుకు చెందిన షేక్ హబీబుల్లా కాడ్లు రెండో స్థానం, కడప జిల్లా నరసాపురానికి చెందిన కామని ప్రతాప్‌రెడ్డి కాడ్లు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు నగదు ప్రోత్సాహకాలను అందించారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గజ్జల శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కూండ్ల ఓబుల్‌రెడ్డి, నల్లగొండు సుబ్బారెడ్డి, నాగం మల్లేశ్వరరెడ్డి, తేలూరు వెంకట శేషారెడ్డి, ఇరగంరెడ్డి శ్రీకర్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'మేమంతా సిద్ధం' సభను జయప్రదం చేయాలి

కడప కార్పొరేషన్: కడప పార్లమెంటు పరిధిలోని ప్రొద్దుటూరులో ఈనెల 27వ తేది నిర్వహించే 'మేమంతా సిద్ధం' సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డా. శివానాయక్ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రం లో ఆరోగ్య శాఖ పై ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటే రాష్ట్రం బాగుంటుందనే నమ్మకంతో ఆరోగ్య శ్రీ ద్వారా ఉచిత వైద్యం చేసుకునే ఖర్చును రూ. 25 లక్షలకు పెంచడం జరిగిందన్నారు.

కరోనా కష్ట కాలంలో కూడా దేశంలో ఏ రాష్ట్రం కూడా చేయని విధంగా ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్ లలో ఆరోగ్యశ్రీ ద్వారా వెంటి లేటర్లను అమర్చి అన్ని వర్గాల ప్రజలకు వైద్యం చేరువయ్యేలా చేసిన ఘనత జగనన్న ప్రభుత్వానిదేనన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కల్యాణోత్సవంలో తాళిని చూపుతున్న వేద పండితులు

వల్లూరు : లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా మండలంలోని మాచిరెడ్డిపల్లెలో సోమవారం స్వామి కళ్యాణ మహోత్సవం వైభవగా సాగింది. అందంగా అలంకరించినన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వాముల ఉత్సవ మూర్తులను ఆశీనులను చేసి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య ఆశీనులను స్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు కనులారా వీక్షించి పులకించిపోయారు. అనంతరం అన్నదానం చేశారు. గత ఐదు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవ కార్యక్రమాలు సోమవారం ధ్వజావరోహణం, పూర్ణాహుతి కార్యక్రమాలతో ముగిశాయి. ఉదయం పాలపళ్ల విభాగం ఎద్దులచే, సాయంత్రం సేద్యపు విభాగం ఎద్దులచే నిర్వహించిన బండలాగుడు పోటీలు ఆసక్తికరంగా సాగాయి. సాయంత్రం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచినవారికి బహుమతులను అందజేశారు.

వేంకటేశ్వరస్వామికి ప్రాకార రథోత్సవం



రథాన్ని లాగడం కోసం సిద్ధమైన శ్రీవారి సేవా సమితి సభ్యులు

జమ్మలమడుగు: పట్టణంలోని నారాపుర వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రాకార రథోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఫాల్గుణ మాసం పౌర్ణమి సందర్భంగా ఆలయంలో టీటీడీ, శ్రీవారి సేవా సమితి ఆధ్వర్యంలో భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై కొలువుంచి ఊరేగింపు జరిపారు. భక్తులు స్వామివారి రథాన్ని లాగడం కోసం పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఇన్‌స్పెక్టర్ మోహన్, అర్చకులు రాజేష్ స్వామి సుధాకర గుప్త, వెంకట కృష్ణుడు, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

పులివెందుల టౌన్ : శబరిమల హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా సోమవారం పార్నపల్లె రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. గురుస్వామి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఉదయం ఐదు గంటలకు స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించి విశేషంగా అలంకరించారు. సాయంత్రం అయ్యప్ప, ఆంజనేయ స్వామి భజనమండలి వారిచే తాళాల భజన నిర్వహించి భక్తులకు అల్పాహారవిందు ఏర్పాటు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలోస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలను అందుకున్నారు.

జగనన్నను మరోసారి సీఎం చేయండి



అప్పారావుపల్లెలో ప్రచారం చేస్తున్న డాక్టర్ రమ్యతారెడ్డి

కమలాపురం : దేశంలో ఎక్కడా లేని విధంగా అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మరోసారి సీఎం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కుమార్తె డాక్టర్ రమ్యతారెడ్డి ప్రజలను కోరారు. కమలాపురం మండలంలోని దాదిరెడ్డిపల్లె, చెన్నారెడ్డిపల్లె, ఎల్లారెడ్డిపల్లె, అప్పారావుపల్లె గ్రామాల్లో ఎంపీపీ గండి భారతితో కలిసి ఆమె ఇంటింటా తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. మహిళలు ఆమెకు హారతి పడుతూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టిందన్నారు.

వలంటీర్, సచివాలయ వ్యవస్థలు తీసుకువచ్చి ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందించిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వైఎస్.అవినాష్ రెడ్డి, పి.రవీంద్రనాథ్‌రెడ్డిలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, రవి శంకర్, గండి భాస్కర్, నాగేంద్ర, కుంచం శ్రీనువాసులరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, క్రిష్టారెడ్డి, రాజారెడ్డి, దేవదానం, బుజ్జన్న, పుల్లారెడ్డి, శేఖర్, చంద్రపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

వీరపునాయునిపల్లె: పౌర్ణమి సందర్భంగా మండలంలోని సంగాలపల్లెలోని శ్రీ శివకృష్ణ గోశాల, వేంపల్లె, యర్రగుంట్ల ప్రధాన రహదారిలోని కాశిరెడ్డి నాయన ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కాశిరెడ్డి నాయన ఆలయంలోని మూల మూర్తితోపాటు ఉత్సవ మూర్తికి ప్రత్యేక అభిషేకాలు, అర్చన జరిపారు. ఆలయాలకు భక్తులతో కిటకిటలాడాయి. దాతలు అన్నదానం చేశారు. వీరపునాయునిపల్లెలో కళాకారుల కోలాటం భక్తులను అలరించింది.

ఘనంగా చండీ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో సోమవారం పౌర్ణమి పర్వదిన సందర్భంగా ఘనంగా చండీ హోమాన్ని నిర్వహించారు. వేకువ జామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, ఉప దేవతా హోమాలు, మృత్యుంజయ, చండీ హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

బస్సు యాత్రను విజయవంతం చేద్దాం

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : ఈ నెల 27వ తేదీన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించబోయే బస్సు యాత్రను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం ఉదయం ఇడుపులపాయ నుంచి యాత్ర ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం తంగెడుపల్లె క్రాస్ వద్ద వీరపునాయునిపల్లె మండలంలోకి చేరుకుంటుందని తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డికి ఘన స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని కోరారు. ప్రతి కార్యకర్త, నాయకులు తమ పరిధిలోని ప్రతి గడపకు వెళ్లి బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు రావాలని కోరాలని సూచించారు. ఎండలు అధికంగా ఉన్నందున ప్రధాన కూడళ్లలో చలువ పందిళ్లు ఏర్పాటుచేసి, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో వీరప్రతాప్‌రెడ్డి, రఘునాథరెడ్డి, రాజుపాలెం వెంకటరామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తొండూరు : ఈ నెల 27వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టే బస్సు యాత్రకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని తొండూరు మండల ఇన్‌ఛార్జి వైఎస్.మధురెడ్డి పిలుపునిచ్చారు. పులివెందులలోని వైఎస్ మధురెడ్డి స్వగృహంలో తొండూరు మండల కార్యకర్తలతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన 27న మధ్యాహ్నం 1 గంటకు మల్లేల– తొండూరు మధ్యన కంకర మిషన్ వద్ద భోజన సౌకర్యం ఏర్పాటుచేశామని తెలిపారు. పులివెందుల, లింగాల, సింహాద్రిపురం, తొండూరు మండలాల కార్యకర్తలు భోజనం చేసిన అనంతరం ప్రొద్దుటూరులో జరిగే బహిరంగ సభకు తరలివెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్లు రవీంద్రారెడ్డి, సురేష్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి, రామమునిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, జిశశికాంత్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమాన్ జంక్షన్ మీదుగా..

వేంపల్లె : ఇడుపులపాయ నుంచి 27న ప్రారంభమయ్యే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రను విజయవంతం చేయాలని వేంపల్లె జడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ లక్ష్మి గాయత్రి, సర్పంచ్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. స్థానిక గండిరోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సోమవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం బస్సుయాత్ర వీరన్నగట్టుపల్లె క్రాస్, వేంపల్లె నాలుగురోడ్ల కూడలి, హనుమాన్ జంక్షన్ మీదుగా కొనసాగుతుందని, ఎక్కడి ప్రాంతాల వారు అక్కడే ఉండాలని సూచించారు. మధ్యాహ్నం కడప–పులివెందుల బైపాస్ రోడ్డులోని సర్పంచ్ శ్రీనివాసులు పొలంలో భోజనాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మేము సిద్ధం సభ

లింగాల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27న ఇడుపులపాయ నుంచి ప్రారంభించే మేము సిద్ధం బస్సుయాత్రను విజయవంతం చేయాలని మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జ్ వైఎస్ అభిషేక్‌రెడ్డి, మండల కన్వీనర్ పివి సుబ్బారెడ్డి ఓ ప్రకటనలో కోరారు. 27న ప్రొద్దుటూరులో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నారని, సభకు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరుకావాలని కోరారు.



సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు



కార్యకర్తలతో మాట్లాడుతున్న వైఎస్ మధురెడ్డి